ఫ్లాట్ ఓనర్.. తన ఇంట్లో రెండు వేలు పోయాయని నామీద పోలీసులకు కంప్లయింట్ ఇచ్చాడు. అదిగో.. అప్పుడే పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐతో మాట్లాడుతున్న విలేకరి కనిపించాడు. తరువాత నాతో మాటలు కలిపి.. ఎస్ఐని ఒప్పించి, నన్ను బయటికి తీసుకొచ్చాడు. ఇక్కడుండటం మంచిది కాదంటూ.. వాళ్ల కాలనీకి తీసుకెళ్లాడు. అబద్ధాలతో భయపెట్టి, నన్ను లొంగదీసుకున్నాడు. వాడే నన్ను ఈ మేడంకు పరిచయం చేశాడు. ఆమెకు ఒక ఎన్జీవో ఉంది. దాని ద్వారా కాలుష్యానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తుండేది మేడం. అందుకోసం ప్రతినెలా ఏదో ఒక సిటీలో తన పెయింటింగ్స్ ప్రదర్శనలు పెట్టేది. మొదట్లో వాళ్ల విల్లాలో పాచి పనులు చేసేదాన్ని. ఆ తర్వాత పెయింటింగ్స్ మోస్తూ మేడం వెంట ఎన్నో సిటీలు తిరిగాను. పదో తరగతి ఫెయిల్ అయిన నేను.. మేడం దగ్గరే హిందీ, ఇంగ్లిష్ చదవడం, రాయడం నేర్చుకున్నాను. కొన్నాళ్లకు మేడంకు పీఏగా మారిపోయా. మేడం ఎన్జీవోలో ఏ పనైనా.. నా చేతులమీదే జరిగేది. మేడం నన్ను సొంత మనిషిలా చూసుకుంది. నన్ను 'మల్లికా!' అని ప్రేమగా పిలిచేది. నేను అక్కణ్నుంచి వచ్చే ముందురోజు.. మేడం నాతో అన్న మాటలు ఇంకా నా చెవుల్లోనే ఉన్నాయి. 'మల్లికా.. నువ్వు వెళ్లిపోవాలి. నిన్ను వదులు కోవడం నాకు ఏమాత్రం ఇష్టంలేదు. కానీ, మామయ్య వచ్చిన దగ్గర్నుంచి మా అందరి మెదళ్లు తింటున్నాడు. పనోళ్లను పంపేయకుంటే.. కరోనాతో చచ్చిపోతామంటూ జడిపిస్తున్నాడు. నీకు డబ్బులు, బట్టలు ఇస్తాను. మీఊరు వెళ్లిపో!' అంటూ చెప్పింది. ఆ మర్నాడే గేట్‌మెన్ వచ్చి నా చెవిలో ఊదిన కబురు.. ఇక తప్పని పరిస్థితిలో ఇలా!''.. అంటూ కళ్లు తుడుచుకున్నది మల్లి.

''నేనున్నానుగా!'' అన్నాడు మల్లి.

ఆకాశం నుంచి ఓ ఉల్క.. అలా తెల్లటి తారాజువ్వలా ఎగిసిపడింది. రెండు మల్లెల కళ్లలో ఆ కాంతిమెరుపు ఒక్క క్షణం. తెల్లారి మళ్లీ కల్వర్టు దిగి, పంట పొలాల గట్ల వెంట నడుస్తున్నారు.

పర్స్ తీసి చూస్తే రెండొందలే మిగిలాయి.

''మన గుంపంతా ట్రక్‌లో వెళ్లిపోతుంటే ఈ నడకెందుకు?'' అడిగింది.

''ఆ గుసగుసలు, చూపులు.. నాకు చిరాకేస్తున్నది'' అంటూ, బలంగా పీల్చిన సిగరెట్ పొగ వదిలాడు.

''మరి ఇలాంటి గుసగుసలు. చెత్త చూపులు రోజూ ఎదురవుతూనే ఉంటాయి!'' అన్నది.

మక్కజొన్న పంట కోతకు వచ్చింది. ఆ గట్ల మధ్య అడుగులో అడుగు వేస్తూ నడుస్తున్నారు. పక్కనున్న మక్కజొన్న పొత్తు ఒకటి తెంపి..

''నేను ఎందుకు నచ్చాను?'' అడిగింది.

''ఏమో! తెలియదు. ఆ రేకుల షెడ్‌లో ఆరుతూ వెలుగుతున్న బల్బు కాంతిలో.. నీ ముఖం, తలలో ఆ మందారం చూసినప్పటి నుంచీ, ఎందుకో తెలియదు.. నా మనసు అదోలా అయిపోయింది. ఇద్దరం కలిసి మళ్లీ సిటీకి వద్దాం! మనం అంటే తెలియని ప్రాంతంలో కిరాణా కొట్టు పెట్టుకుందాం!'' అన్నాడు.

''సిటీ వదిలి పరుగులు తీసిన మనం.. మళ్లీ తిరిగి వస్తామంటావా!?'' అన్నది.

* * *

తొందరగా ఊరు చేరుకోవాలంటూ వడివడిగా అడుగులు వేస్తూ నడుస్తున్నారు. తమ వెంట వస్తున్నవాళ్లూ ఏదో తెలియని దుఃఖం, భయంతో అడుగులేస్తున్నారు. కొన్ని గంటలు నడిచాక.. ఓ టౌన్ పొలిమేరకు చేరుకున్నారు. వాళ్లలో ఓ కుర్రాడు మైలురాయి చూపించి..

''మన రాష్ట్రానికి వచ్చేశాం!'' అంటూ కేక వేశాడు. తమ ప్రాంతానికి చేరుకున్నామన్న ఫీలింగ్‌తో గుంపులోని వారంతా ఆనందంగా ఉన్నారు. లారీలు, ట్రక్కులు అక్కడక్కడా ఆపుతున్నా.. గుంపులో ఎవ్వరూ ఎక్కడం లేదు. జేబులో నోట్లు లేవు. పోలీసులు పట్టుకుంటారేమోననే భయం కూడా తోడయ్యింది. అలా కొంతదూరం నడిచాక.. టౌన్ మార్కెట్ వచ్చింది. చాలాసేపట్నించీ ఎందుకో మల్లి అటూ, ఇటూ చూస్తున్నది.

''ఏంటి సంగతి?'' అన్నాడు.

చిటికిన వేలు చూపింది.

''ఓహో.. జనాలు పెద్దగాలేరు కదా! ఆ సందులోకి వెళ్లు. నేను మలుపులో ఉంటాను'' అన్నాడు.

తలలోంచి వాడిపోయిన మందారాన్ని తీసి చూసుకుంటూ.. సందులోకి వెళ్లింది.

ఇంతలో పోలీస్ వ్యాన్ రావడం, అక్కడున్నవారందరినీ లాఠీలతో బాదేయడం.. క్షణాల్లో జరిగిపోయింది.

'మల్లీ!' అంటూ కేకవేసేలోపే.. మల్లి వీపుమీద లాఠీ దెబ్బలు. కళ్లు తిరిగి పడిపోయాడు.

* * *

కంట్లో పడ్డ తుంపర్లను తుడుచుకుంటూ.. రైలు బోగీలో చాయ్‌వాలా కేకతో ఈ లోకంలోనికి వచ్చాడు మల్లి. బోరున ఏడిస్తే బాగుండు అనిపించింది. ఏడుపు బదులు ఎన్నో ఆలోచనలు చుట్టుముట్టాయి. మల్లి తప్పిపోయిన టౌన్, తాము ఆగిన గ్రామాలు ఎన్ని వెదికినా.. ఆమె జాడ తెలియలేదు. ఉదయం సిటీకి చేరుకున్న తరువాత ఏం చేయాలనుకుంటూ.. నిద్రలోకి జారుకున్నాడు. ఉదయానికల్లా సిటీ స్టేషన్‌లోకి చేరుకున్నది రైలు. స్టేషన్‌లో దిగి.. చాయ్‌తాగి, సిగరెట్ వెలిగించాడు.

'మేడంను కలవాలా? ఆ విలేకరిని కలవాలా!?' అని ఆలోచించాడు. ఏం చేయాలో తెలియడంలేదు. మల్లి కనుమరుగైన రోజు గుర్తుకొచ్చింది.

..అలా లాఠీ దెబ్బలతో పడిపోయిన తనను పోలీస్ లాకప్‌లో పడేశారు. మర్నాడు కానిస్టేబుల్ వచ్చి..

''టౌన్ వదిలి పారిపోతానంటే వదిలేస్తాం! ఇప్పటికే నీతో వచ్చిన వారిని వదిలేశాం. నువ్వు కూడా పారిపో!'' అన్నాడు.

''అలాగే!'' అంటూ.. స్టేషన్ బయటికి వచ్చాడు.

మల్లి తన కళ్ల ముందునుంచి వెళ్లిపోయిన సందు కోసం వెతుకులాడుతుంటే.. తనతోపాటు లాఠీ దెబ్బలు తిని బయటపడ్డ గుంపులోని వారు ఒక లారీని ఆపారు.

''పోలీసులకు దొరికితే ఈసారి చంపేస్తారు!'' అంటూ బలవంతంగా ఆ లారీలోకి ఎక్కించి.. ఊర్లో వదిలారు.

ఆమె మళ్లీ మేడం దగ్గరికే వెళ్లిందేమోనన్న చివరి ఆశతో.. తాను వదలిన నగరంలో మళ్లీ అడుగుపెట్టాడు మల్లి. మల్లిక గతంలో చెప్పిన వివరాలను బట్టి.. మేడం విల్లాకు వెళ్లాడు. అక్కడ గేట్‌మ్యాన్ ఉన్నాడు.

''మల్లి ఉందా!?'' అని అడిగాడు హిందీలో.

''మల్లి ఎవరు?'' అన్నాడు అతను.

''అదే మల్లిక!'' అన్నాడు మల్లి.

''ఇక్కడ అలాంటివారు ఎవరూ లేరు. గేట్ దగ్గర ఎక్కువసేపు ఉండకూడదు!'' అంటూ పంపేయబోయాడు.

''మేడం ఉన్నారా.. కలవాలి'' అన్నాడు మల్లి.

''ఎందుకూ!? మేడం లేరు. ఈ రోజు సిటీలో ఆమె పెయింటింగ్స్ ప్రదర్శన ఉంది. అక్కడే ఉన్నారు!'' అంటూ, ఆరోజు పేపర్లో ప్రకటన చూపించాడు.

మొత్తానికి ఆ ప్రదర్శన ఆడిటోరియం వెతికి.. మేడంను కలిశాడు మల్లి. మొత్తం కథ చెప్పాడు.

ఆమె కళ్ల నీరు తుడుచుకుంటూ..

''మల్లిక నా దగ్గరికి రాలేదు! ఆమెను నేను మరిచిపోలేను!'' అని చెప్పింది.

తన ఫోన్‌లో మల్లి నెంబర్ వెతికి.. కాల్ చేసింది. 'స్విచ్‌డ్ ఆఫ్' అని రావడంతో పెదవి విరిచింది. మళ్లీ ఎవరిదో ఫోన్ నెంబర్ వెతికి.. గబగబా కాల్ చేసి, ఏదో మాట్లాడింది. ఓ గంటలో మోటర్ సైకిల్ మీద నలభై ఏళ్ల వ్యక్తి వచ్చాడు.

''ఇతను మల్లి. అదే.. మన మల్లిక బంధువు''.. అంటూ మల్లిని పరిచయం చేసింది.

''ఈయన విలేకరి అఖిలేష్. ఈయనే.. మల్లిని నాకు పరిచయం చేసింది!'' అంటూ పరిచయం చేసింది.

వాణ్ని అక్కడికక్కడే చంపేయాలని అనిపించింది మల్లికి. తమాయించుకున్నాడు.

ఆమెకు, అతనికి దండంలాంటిది పెట్టి.. ఆడిటోరియం నుంచి బయటికి వచ్చాడు. రోజులు గడుస్తున్న కొద్దీ.. మహానగరం మహా కోలాహలంగా కోలుకుంది. మళ్లీ తన టైల్స్ పని చేసుకుంటూ, పాత కాలనీలోనే ఉంటున్నాడు. తామిద్దరం లాక్‌డౌన్ రాత్రి దాక్కున్న రేకుల షెడ్ అలానే ఉంది. అక్కడి వీధిలైట్ ఇంకా వెలుగుతూ ఆరుతూనే ఉంది. మల్లి మాత్రం దొరకలేదు. విలేకరికీ, మేడంకు ఫోన్ చేయడం కూడా మానేశాడు.

లక్కీ సిటీ పార్లర్ దగ్గర భాస్కర్, ముఖలింగం, ఉమ కలుస్తూనే ఉన్నారు.

పక్కనున్న సిటీలో కడుతున్న రియల్ ఎస్టేట్ వెంచర్లో వాళ్లు ముగ్గురూ కలిసే పనికి కుదురుకున్నారు.

'మల్లి ఫోన్ పారేసుకున్నాడా? డబ్బుల్లేక రీచార్జింగ్ చేయించలేదా? అసలు ఆ అమ్మాయి జాడ తెలిసి ఉంటుందా!?' అని రోజూ పార్లర్ దగ్గర టీ తాగుతూ మాట్లాడుకుంటూనే ఉన్నారు.

''ఏం గురూ! మనూర్లు కూడా సిటీలో కలిసిపోతాయేమో!?''.. ఎప్పట్లాగానే అడిగాడు ముఖలింగం. ■

## ఎండీ అబ్దుల్లా



కొవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని గజగజా వణికించిన సమయంలో.. తన పాత్రికేయ జీవితంలో ఎదురైన సంఘటనలు, అనుభవాలను స్ఫూర్తిగా తీసుకొని 'లక్కీ సిటీపార్లర్' కథ రాశారు ఎండీ అబ్దుల్లా. ఈయన స్వస్థలం తీర నగరం విశాఖపట్నం. జర్నలిజంలో మాస్టర్స్ చేశారు. మూడు దశాబ్దాలుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్నారు. విశాలాంధ్ర, ఉదయం, ఆంధ్రజ్యోతి, వార్త, హెచ్ఎంటీవీ, ఈనాడు లాంటి సంస్థలలో పనిచేశారు. ప్రస్తుతం ఈటీవీలో సీనియర్ జర్నలిస్టుగా సేవలు అందిస్తున్నారు. ఈయన రాసిన 'బొమ్మ' కథ.. తొలుత ఆంధ్రభూమి దినపత్రికలో ప్రచురితమైంది. 'నేటి కథ' సంపుటిలోనూ స్థానం దక్కించుకున్నది. 'వైజాగ్ ఎక్స్‌ప్రెస్' కథ.. ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ముద్రితమైంది. 'తూనీగ గీతం' కథ.. ఉత్తరాంధ్ర పత్రికకు ఎంపికైంది. 'వార్త' దిన పత్రికలో ఉత్తమ సబ్ ఎడిటర్‌గా పురస్కారం అందుకున్నారు. 2006లో అధికార భాషా సంఘం పురస్కారం దక్కించుకున్నారు.